జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.
epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..
జాతీయ వార్త తెలుగు దినపత్రిక
మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

శనివారం | 10-5-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 334 పేజీలు: 4 వెల : రూ.7

## కొందరు అధికార పార్టీ నేతలే..
# ఇసుక దొంగలు!

* ఆకులతంపరలో ఇసుక దోపిడి
* మళ్లీ మొదలైన అధికార పార్టీ నాయకుల దందా
* అనుమతులకు మించి తవ్వకాలు
* కన్నెత్తి చూడని రెవెన్యూ, మైనింగ్ అధికారులు
* నది దిశ మారడంతో ఆందోళనలో వంశధార పరివాహక ప్రాంత ప్రజలు



**కొత్తూరు/శ్రీకాకుళం, మే 9 (వార్త):** కొత్తూరు మండలంలోని ఆకులతంపర గ్రామంలోని వంశధార నదీతీరంలో దొంగలు ఇసుకను పట్టపగలే దోచేస్తున్నారు. యంత్రాలతో అనుమతులకు మించి తవ్వేస్తూ లారీలతో ఒడిశా, విజయనగరం, విశాఖపట్నం తరలించేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన నేతలే ఈ దందాను దర్జాగా చేస్తూ కాసులు కూడబెట్టుకుంటున్నారు. కొందరు ద్వితీయ శ్రేణి నాయకులైతే ఎమ్మెల్యేల పేరు చెప్పుకొని మరీ ఈ దందా సాగిస్తున్నారు. పట్టపగలే ఇసుకను దోచేస్తున్నా రెవెన్యూ, మైనింగ్ అధికారులకు వాటాలు వెళుతుండడంతో కన్నెత్తి చూడడం లేదన్న విమర్శలు ఉన్నాయి. వంశధార నదిలో ఆకులతంపర వద్ద జేసీబీలు, పదుల సంఖ్యలో టిప్పర్లు, లారీలు నిత్యం కనిపిస్తున్నాయి. గతంలో ఇసుక ర్యాంపులో జరుగుతున్న అక్రమ తవ్వకాలపై టీడీపీ శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అడ్డుకున్నారు. సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఇసుక తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. పది నుంచి పదిహేను అడుగుల లోతులో వంశధార నదిలో ఇసుకను తవ్వుతుండడంతో నదులు.. బావుల మాదిరిగా మారుతున్నాయి. వరద వస్తే నదీ ప్రవాహ దిశ మారుతుందేమోనని పరివాహక ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.





# మస్కట్ టు సిక్కోలుకు కార్మికులు

* స్వదేశానికి చేర్చిన కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు * ఆనందం వ్యక్తం చేసిన కుటుంబీకులు



**శ్రీకాకుళం, మే 9 (వార్త):** ఉపాధి కోసం మస్కట్ వెళ్లిన శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం ప్రాంతానికి చెందిన కార్మికులు ఓ ప్రైవేట్ కంపెనీ చేత మోసపోయి నెలల తరబడి తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనిలేకుండా, జీతాల్లేకుండా, ఆకలితో అల్లాడుతున్న వారి కుటుంబ సభ్యుల నుంచి సమాచారం అందుకున్న కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు వెంటనే స్పందించారు. వీడియో కాల్ ద్వారా కార్మికులతో మాట్లాడి ధైర్యం చెప్పిన ఆయన, విదేశాంగ శాఖ, మస్కట్ లోని భారత దౌత్య కార్యాలయంతో, తెలుగుదేశం పార్టీ ఎన్నారై విభాగంతో సమన్వయం చేసి, కార్మికులకు తక్షణ వసతి, ఆహారం అందేలా చూశారు. అంతేకాక వారి తిరుగు ప్రయాణంలో ముంబై విమానాశ్రయ అధికారులతో సమన్వయం చేసుకొని ఆహారం అందించి ముంబై నుంచి శ్రీకాకుళం వరకు ప్రయాణ ఖర్చులు స్వయంగా భరించి, తొమ్మిది మందిని సురక్షితంగా స్వస్థలాలకు చేర్చించారు. ఇప్పటికే కార్మికులు తమ ఊర్లకు చేరుకుని, కుటుంబ సభ్యులను కలిసిన సందర్భంగా కేంద్ర మంత్రికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. విదేశంలో పని లేక, ఆకలితో తీవ్రంగా ఇబ్బంది పడ్డ తమకు ఇంత వేగంగా సహాయం చేయడంపై ఆనందం వ్యక్తం చేశారు.

## జవాన్ మృతిపై మంత్రి అచ్చెన్నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి



**శ్రీకాకుళం, మే 9(వార్త):** జమ్మూ కాశ్మీర్ పాక్ కాల్పుల్లో రాష్ట్రంలోని సత్య సాయి జిల్లా గోరంట్ల మండలానికి చెందిన మురళి నాయక్ మృతి పట్ల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శుక్రవారం తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ మురళి నాయక్ మృతి తీవ్రంగా కలిసి వేసిందన్నారు. ఆయన చేసిన ధైర్య సాహసాలు రాష్ట్రానికి, దేశానికి గర్వకారణమన్నారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని విడచివెళ్లిన ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# బాల్య వివాహాల నిర్మూలనకు చర్యలు తీసుకోండి

**-కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**

**శ్రీకాకుళం, మే 9(వార్త):** జిల్లాలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. మిషన్ వాత్సల్య పథకం అమలుపై శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన బాలల సంక్షేమ, రక్షణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాథలు, డ్రాప్ అవుట్ బాలలు, కార్మికులుగా పని చేస్తున్న చిన్నారులను గుర్తించి పునరావాసం కల్పించాల న్నారు.గ్రామ/వార్డ్ సచివాలయాల పరిధిలో బాల్య వివాహాల సమాచారం లభించిన వెంటనే ఆ వివాహాలను నిలిపివేసి, సంబంధితులపై కేసులు పెట్టాలన్నారు. బాలల హక్కుల పరిరక్షణకు ప్రతి శాఖ కలిసికట్టుగా పని చేయాలన్నారు. టీనేజీ ప్రెగ్నెన్సీ, ట్రాఫికింగ్, డ్రగ్స్, దోపిడీ లాంటి అంశాలపై గ్రామ స్థాయిలో అవగా




హన కల్పించాలని సూచించారు. బాధిత బాలికలకు వన్ స్టాప్ సెంటర్ల ద్వారా తక్షణ ఆశ్రయం, చికిత్స, న్యాయ సహాయం కల్పించాలని, కేసులపై మహిళా పోలీసులు నిరంతరం ఫాలో అప్ చేయాలన్నారు. డ్రాప్ అవుట్ బాలికల సమస్యలపై డీఈఓ, కర్మాగారాల్లో పనిచేస్తున్న బాలికల విషయమై లేబర్ కమిషనర్ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఆరు నెలలకు జిల్లా స్థాయిలో కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పీడీ శాంతి శ్రీ, డాక్టర్ అనిత, సీఈఓ శ్రీధర్ రాజా, పీడీ కిరణ్‌కుమార్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, చైల్డ్ లైన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహభరితంగా జిల్లా వూషు క్రీడా పోటీలు




**శ్రీకాకుళం, మే 9(వార్త):** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)ప్రాంగణంలో శుక్రవారం జిల్లా వూషు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పోగిరి కృష్ణంనాయుడు, రెడ్డి శివకుమార్ల ఆధ్వర్యంలో 11వ సబ్ జూనియర్,10వ జూనియర్,9వ సీనియర్ వూషు జిల్లా స్థాయి ఛాంపియన్ షిప్ పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ వూషు క్రీడా పోటీలకు సభాధ్యక్షులుగా జిల్లా ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు వ్యవహరించారు. గురువుల ప్రతిభ, శిష్యులతోనే తెలుస్తుందన్నారు. ముఖ్య అతిధులుగా విచ్చేసిన జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారి డాక్టర్ కె.శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి విద్యా రంగంలో స్పోర్ట్స్ కోటా పెట్టారన్నారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి మాట్లాడుతూ పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలని ఆయన అన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ గేదెల మాట్లాడుతూ మంచి క్రీడాకారులుగా ఉంటూ భవిష్యత్తుకు బంగారు బాటలు వేయవచ్చన్నారు. క్రీడల్లో మంచి ప్రతిభ కనబరిచి జాతీయస్థాయిలో పథకాలు సాధించినట్లయితే స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఊసు ప్రధాన కార్యదర్శి రెడ్డి శివకుమార్ మాట్లాడుతూ జిల్లాస్థాయిలో బంగారు పతకాలు సాధించిన వారే రాష్ట్రస్థాయిలో పాల్గొనడానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావు, రెడ్డి సాయికుమార్, స్టార్ వనితా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు గేదెల లక్ష్మి, సీనియర్ క్రీడాకారులు మురళి మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# శతక రక్తదానమే ధ్యేయం

**శ్రీకాకుళం, మే 9(వార్త):** ఇప్పటి వరకు పదహారు ఎస్డీపీ (సింగల్ డోనర్ ప్లేట్ లెట్'), ముప్పై ఒక్క సార్లు రక్తదానం చేసిన అల్లాడ నవీన్ ప్రాణదాతగా మారి, శతక రక్తదానమే ధ్యేయమని మదర్స్ లవ్ ఫౌండేషన్ సభ్యులు శుక్రవారం తెలిపారు. స్థానిక కిమ్స్‌లో గుండెకు సంబంధించిన శస్త్ర చికిత్స చేసుకున్న శ్యామలకు ప్లేట్ లెట్'స్ కౌంట్ ఒక్కసారిగా ఆరువేలు పడిపోవటంతో, మదర్స్ లవ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుప్రజ రౌత్ సంస్థ సభ్యులు అల్లాడ నవీన్, స్థానిక రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రంలో, ఎస్డీపీ అందించి ప్రాణాలు కాపాడారు. మదర్స్ లవ్ ఫౌండేషన్ అధ్యక్షురాలు సుప్రజ రౌత్ మాట్లాడుతూ ప్రాణదాత నవీన్ రక్తదానంలో ఎప్పుడూ ముందుంటారని, అందరిలో స్ఫూర్తి నింపుతూ నగరంలో రక్త కొరత ఉన్న రక్తనిధికేంద్రానికి, రక్తదాతలను సమకూర్చుతారని, ఈ రోజు తలసేమియాదినం కావటంతో ఒక ప్రాణాన్ని కాపాడటం ఆనందదాయకమన్నారు. నగరంలో తలసేమియా పిల్లలకు ఎప్పుడు రక్తం అవసరం అనుకున్న మదర్స్ లవ్ ఫౌండేషన్ ముందుంటుందన్నారు. నిరంతరం ఏదో ఒక సేవలో నిమగ్నమౌతూ, ఒక ప్రక్క ప్రతి రోజు రాత్రి వేళలో, అన్నార్థులకు అన్నదానాలు నిర్వహిస్తున్నామని, పగటిపూట రక్తదానాలలో బాగామోతున్నామన్నారు. మాకు సహకారమందిస్తున్న ఎమర్జెన్సీ బ్లడ్ సర్వీస్ నంది ఉమా శంకర్, సేవకులు, మదర్స్ లవ్ ఫౌండేషన్ సభ్యులు, లైన్స్ క్లబ్




మార్కెటింగ్ ఛైర్పర్సన్ ఉర్లం శివతేజ పట్నాయక్ లకు ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధి నంది. ఉమా శంకర్, దాత, మదర్స్ లవ్ ఫౌండేషన్ సభ్యులు అల్లాడ. నవీన్, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

**నరసన్నపేట, మే 9(వార్త):** జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాల్లో నిర్వహిస్తున్న జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని నరసన్నపేట శాసన సభ్యులు బగ్గు రమణమూర్తి తెలిపారు. నరసన్నపేటలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో ఆయన మాట్లాడుతూ జాబ్ మేళాకి హాజరైన ప్రతి నిరుద్యోగ యువత ఈ ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. గతంలో అభ్యర్థులు కంపెనీల చుట్టూ తిరుగుతూ ఉదోగాల కోసం నిరీక్షణ చేయాల్సి వచ్చేదని, ఇప్పుడు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కంపెనీలే మనవద్దకు వచ్చి వారికి కావాల్సిన అభ్యర్థులను ఎంపిక చేసుకునే విధంగా పరిస్థితులు మెరుగుపడ్డాయని వివరించారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యు. సాయి కుమార్ మాట్లాడుతూ ఏ రంగంలో ఉద్యోగ అవకాశం వచ్చినా సరే దూరంతో సంబంధం లేకుండా అభ్యర్థులు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపరచుకావాలని కోరారు. ముందు ఉద్యోగంలో చేరి తర్వాత ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేసుకోవాలని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు




రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో జాబ్ మేళాలు నిర్వహించుచున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగా నరసన్నపేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక నరసన్నపేటలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో మెగా జాబ్ మేళా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ మెగా జాబ్ మేళాకి 12 ప్రైవేటు సంస్థల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు. దీనిలో 327 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా అందులో 112 మంది వివిధ కంపెనీలకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఉపాది అధికారి సుధ, సెట్ శ్రీ సీఈవో ప్రసాదరావు, కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.లత, ఇతర ప్రజా ప్రతినిధులు, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



## అక్రమ కట్టడాలను గుర్తించి చర్యలు చేపట్టండి

**పలాస, మే 9(వార్త):** పలాస మున్సిపాలిటీలో అక్రమ కట్టడాలను గుర్తించి, కోర్టులో కేసులు నమోదు చేయాలని పలాస మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫార్మ్ నిర్వహించిన కమిషనర్. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం కార్యాలయంలో అన్ని సచివాలయంల ప్లానింగ్ కార్యదర్శులతో కలసి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫార్మ్ ని కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో గల అక్రమ కట్టడాలను గుర్తించి వాటిపై స్థానిక కోర్టులో కేసులు నమోదు చేసి పురపాలక సంఘ ఆదాయమును మెరుగుపరచవలసిందిగా కోరారు. ఇంకనూ ఈ పురపాలక సంఘంలో ఇంటి నిర్మాణం చేస్తున్న గృహ యజమానులను గుర్తించి ప్రతి వారితో కూడా బిల్డింగ్ అప్లికేషన్లు పెట్టించి వారికి బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ పై అవగాహన కల్పించవలసింది గా సూచించారు. ఈ పురపాలక సంఘంలో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న వారిని గుర్తించి తగు చర్యలు తీసుకొనుటకు గాను ప్రతి ఒక్క సచివాలయ సిబ్బంది కూడా సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘము పరిధిలోని అన్ని సచివాలయంల ప్లానింగ్ కార్యదర్శిలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీఎస్పీ నూతన కమాండెంట్‌గా పద్మనాభరాజు

**శ్రీకాకుళం, మే 9(వార్త):** ఆంధ్రప్రదేశ్ రక్షణలో భాగంగా శాంతిభద్రతల పరిరక్షణ, బందోబస్తులు, తీవ్రవాద నిర్మూలన అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేయడానికి సివిల్ పోలీస్‌కు సహాయకారిగా ఉండడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చొరవతో నూతనంగా శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలంలో ప్రారంభించిన 1వ ఏపీఎస్పి (ఐర్) బెటాలియన్‌కు నూతన కమాండెంట్‌గా శాంతి భద్రతల పరిరక్షణలో, తీవ్రవాద నిరోధంలో, వివిధ సేవా కార్యక్రమాలలో సుదీర్ఘ అనుభవం కలిగిన పద్మనాభరాజుని పదోన్నతిపై



నియమించడంతో ఆయన బాధ్యతలు తీసుకుని బెటాలియన నిర్మాణం, నిర్వహణ కార్యకలాపాల గూర్చి సిబ్బందితో చర్చించి సూచించడం జరిగింది. కార్యక్రమంలో అడిషనల్ కమాండెంట్ పి.సత్తిబాబు, అసిస్టెంట్ కమాండెంట్స్ నాగేశ్వరరెడ్డి, నాగ శ్రీను, నగేష్ బాబు , గోపాల కృష్ణ, ఏవో తిలక్, ఆర్.ఐ శ్రీధర్ మరియు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.


## మందస ఎంపీడీఓగా వెంకటరమణ బాధ్యతల స్వీకరణ



**మందస, మే 9(వార్త):** మందసకు రెగ్యులర్ ఎంపీడీఓ నియమితులయ్యారు. మందస ఎంపీడీఓగా వై.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వెంకటరమణ శ్రీకాకుళం మండల పరిషత్ లో పరిపాలన అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై మందస రెగ్యులర్ మండల పరిషత్ అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇంచార్జి ఎంపీడీఓగా బాధ్యతలు నిర్వహించిన ఎన్.రమేష్ నాయుడు వేకతరమణ బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా నియమితులైన ఎంపీడీఓ వెంకటరమణకు మందస మండల పరిషత్ పరిపాలనాధికారి బూరగాన రుషేశ్వరరావు, ఈఓఆర్డీ జయప్రకాశ్, టైపిస్ట్ ధనలక్ష్మి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేయాలి

**పలాస, మే 9(వార్త):** ఆపరేషన్ సింధూర్ విజయవంతం చేయాలని బిజెపి నాయకులు దేవాలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలాస భారతీయ జనతా పార్టీ నాయకులు పాలవలస వైకుంఠరావు, రామానంద స్వామిజీ, పొట్నూరు తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఆర్టీసీ డ్రైవింగ్ స్కూల్ 21 వ బ్యాచ్ కు దరఖాస్తుల ఆహ్వానం



**శ్రీకాకుళం, మే 9(వార్త):** ఏపీఎస్ఆర్టీసీ హెవీ డ్రైవింగ్ స్కూల్ నందు 21 వ బ్యాచ్ హెవీ డ్రైవింగ్ శిక్షణ కు గాను లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగినటువంటి వారు దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ. విజయ్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 3వ వారంలో ప్రారంభమయ్యే 21వ బ్యాచ్ లో 16 మందికే అవకాశం ఉన్నందు వలన అందరూ ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని దరఖాస్తు చేసుకోవలసిందిగా ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజు ఇతర వివరాల కోసం9441161051, 9390886033 నెంబర్లను సంప్రదించవలసినదిగా ఆయన కోరారు.

# ప్రజా ఫిర్యాదులు పెండింగ్ ఉండరాదు

**-ఎస్పీ మహేశ్వర రెడ్డి**

**-వారంలో రెండు రోజులు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక నిర్వహణ**



**పలాస, మే 9(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులకు ప్రాధాన్యత ఇచ్చి చట్ట ప్రకారం విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని, ఆయా ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి పోలీసు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కాశీబుగ్గ పోలీసు స్టేషనులో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ప్రజలు వద్ద నుండి పిర్యాదులు స్వీకరించి, వారితో ముఖా ముఖీ మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను తెలుసుకొని పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఫిర్యాదు దారుల అర్జీలు,వారి వివరాలు కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో సంబంధిత పోలీసు అధికారులకు తక్షణమే తెలియ పరిచి చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని అదేశించారు. పబ్లిక్ గ్రీవెన్స్ లో వచ్చే ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎప్పటికప్పుడు జిల్లా పోలీస్ కార్యాలయానికి నివేదిక ద్వారా పంపించాలని ఎస్పి తెలిపారు. కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో గల ప్రజలు ప్రతి శుక్రవారం కాశీబుగ్గ పోలీసు స్టేషనులో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పి కోరారు.

ఎస్పీ తో పాటు కాశీబుగ్గ డిఎస్పి ఎం వెంకట అప్పారావు, కాశీబుగ్గ సీఐ పి సూర్యనారాయణ, సబ్ ఇన్స్పెక్టర్లు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## మహారాణా ప్రతాప్ సింగ్ జయంతి వేడుకలు



**శ్రీకాకుళం, మే 9(వార్త):** మహా రాణా ప్రతాప్ సింగ్ హైందవ సేవా సంఘ్ అధ్యక్షులు సురేష్ బాబు సింగ్ ఆధ్వర్యంలో శ్రీకాకుళంలోని పాత హౌసింగ్‌బోర్డు కాలనీలో ఉన్న సంఘ్ కార్యాలయం లో మహా రాణా ప్రతాప్ సింగ్ హైందవ సేవా సంఘ్ సభ్యులు సమక్షంలో వేడుకలు జరిగాయి. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు సింగ్ విలేకరులతో మాట్లాడుతూ, మహారాణా ప్రతాప్ సింగ్ హిందూ దేశ పరిరక్షణ కొరకు తన ప్రాణాలను సైతం లెక్కచేయక అక్బర్‌ను ఎదిరించిన వీరుడని కొనియాడారు. కార్యక్రమంలో, కార్యదర్శి రాజా అరవింద్ సింగ్, కోశాధికారి ధన్ సింగ్, ఉపాధ్యక్షులు గణేష్ సింగ్, సోషల్ మీడియా ఇంచార్జి లోకేష్ సింగ్, జై ఆదిత్య సింగ్, రమేష్ కుమార్ సింగ్, గజలక్ష్మి, వాణి, హిమబిందు భాయ్, జగ్గు భాయ్, హర్షిత భాయ్, తదితరులు పాల్గొన్నారు.

## హైకోర్టులో కేసు ఉన్నా.. దౌర్జన్యంగా రోడ్డు వేశారు

**సంతబొమ్మాళి, మే 9(వార్త):**



హైకోర్టులో కేసు ఉన్న పోర్ట్ యాజమాన్యం రెవెన్యూ, పోలీస్ అధికారుల సహాయంతో దౌర్జన్యంగా తన భూములో రోడ్డు వేశారని కూర్మనాధపురం గ్రామానికి చెందిన రైతు కోట రామ్మూర్తి ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో తమ గోడును వెళ్ళబుచ్చారు. పోర్టు రైల్వేలైన్ కోసం తన 58 సెంట్లు మెట్టు భూమి ఇవ్వ లేదని తెలిపారు. ఈ ప్రాంతంలో సెంటు ఒక లక్ష 50 వేలు ఉంటే ప్రభుత్వం కేవలం సెంటు 25 వేల రూపా యలు పరిహారం ఇస్తుందని తెలిపారు. ఇది మెట్టు భూమి అయితే పల్లపు భూమి అని నమోదు చేశారని మండిపడ్డారు.దీంతో ఈ పరిహారం సరిపోదని జిల్లా కలెక్టర్, టెక్కలి ఆర్డిఓ, తాసిల్దార్ కు వినతి పత్రాలు ఇచ్చానన్నారు .మూడు నెలలు కావస్తున్న న్యాయం జరగకపోవడంతో హైకోర్టును ఆశ్రయించానని దీనిపై కేసు నడుస్తుందన్నారు. హైకోర్టులో కేసు ఉండగా రెవెన్యూ, పోలీస్ లను అడ్డం పెట్టుకొని పోర్టు యాజమాన్యం దౌర్జన్యంగా నా భూమి గుండా రైల్వే లైన్ కు చదును చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. విలువైన జీడి మామిడి ఇతర మొక్కలను కూల్చివేసి రోడ్డు వేశారని మండిపడ్డారు. దీన్ని నేను అడ్డుకుంటే దౌర్జన్యంగా పోలీస్ స్టేషన్లో పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు నుండి నోటీసులు వస్తాయని భయంతోనే దౌర్జన్యంతో పోర్టు రైల్వే లైన్ కు నా భూమిని చదును చేశారని తెలిపారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తానని అన్నారు.

# రాష్ట్రంలో విమానయాన సేవల విస్తరణ




**శ్రీకాకుళం, మే 9(వార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విమానయానాన్ని మరింత ప్రోత్సహించడమే లక్ష్యంగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు కీలక ప్రకటన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కనెక్టివిటీ, సౌలభ్యాన్ని పెంపొందిం చేందుకు కొత్తగా మూడు విమాన సేవలు ప్రారంభిం చనున్నట్లు తెలిపారు.

జూన్ 13 నుంచి ఇండిగో సంస్థ ద్వారా విశాఖపట్నం-అబుదాబి అంతర్జాతీయ విమాన సేవ ప్రారంభం కానుంది అని, వారంలో నాలుగు రోజుల పాటు నడిచే ఈ సర్వీస్‌తో పాటు ఇతర దేశాలలోని ప్రవాసాంధ్రులను 'సిటీ ఆఫ్ డెస్టినీ' అయిన విశాఖపట్నంతో నేరుగా కలపనుంది అని తెలిపారు. విశాఖపట్నం -భువనేశ్వర్ విమాన సర్వీసు జూన్ 12 నుండి విశాఖపట్నం -ఒడిశా రాజధాని భువనేశ్వర్ మధ్య ప్రారంభం కానుంది అని, ఇది రెండు తూర్పు తీర నగరాల మధ్య వాణిజ్య, పర్యాటక మరియు సాంస్కృతిక సంబంధాలను మరింత బలోపేతం చేయనుంది అని తెలియజేశారు. జూన్ 2 నుండి ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ సంస్థ విజయవాడ -బెంగళూరు అదనపు విమాన సేవను ప్రారంభించనుంది అని, ఇది ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరాన్ని దక్షిణ భారతదేశ ఐటీ రాజధాని అయిన బెంగళూరుతో నేరుగా కలుపుతుంది అని తెలిపారు. ఈ సేవలు రాష్ట్ర అభివృద్ధికి, మెరుగైన కనెక్టివిటీకి మార్గదర్శకంగా నిలుస్తాయని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. ఈ చర్యలు కనెక్టెడ్ ఆంధ్రప్రదేశ్ అనే చంద్రబాబు కలను నిజం చేస్తాయన్నారు. విమానయానంలో ఈ కొత్త అడుగులు రాష్ట్రాన్ని దేశంలోని ప్రధాన నగరాలతో పాటు ప్రపంచంతో మరింత దగ్గర చేస్తాయని వారు విశ్వాసం వ్యక్తం చేశారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి నాలుగేళ్ల జైలు

**పలాస, మే 9(వార్త):** మద్యం తాగడానికి బానిసై, మహిళలు దురుసుగా ప్రవర్తిస్తున్న వడ్డి సంతోష్ కుమార్‌ను ఇప్పిలి కృష్ణారావు మందలించాడు. దీంతో సంతోష్ ఆయనను చంపేస్తానని బెదిరించాడు. 22.01.2022న రాత్రి 9.30 గంటల ప్రాంతంలో సంతోష్ మళ్ళీ మహిళలను వేధించాడు. దీంతో కృష్ణారావు ఆయనను మందలించి గెడ్డకు వెళ్లి వారి ఇంటికి తిరిగి వచ్చాడు. ఇంతలో సంతోష్ వెనుక నుండి వచ్చి కృష్ణారావు వీపుపై రెండుసార్లు పొడిచాడు. దీనిపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసి నిందితుడిని 24.01.2022న అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపారు. అప్పటి సీఐ శంకర్రావు కోర్ట్ లో చార్జ్ షీట్ వేసిన పిమ్మట స్పెషల్ పీపీ దువ్వు జగన్నాయకులు వాదించారు. ముద్దాయిపై నేరం రుజువు అయినందున నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1,000 జరిమాన విధిస్తూ శుక్రవారం అసిస్టెంట్ సెషన్ జడ్జ్ కోర్టు సోంపేట జడ్జి జె.శ్రీనివాసరావు తీర్పు ఇచ్చారు. పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

# ఉపాధ్యాయుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



**శ్రీకాకుళం, మే 9(వార్త):** ప్రభుత్వ పాఠశాలల మనుగడను ప్రశ్నార్ధకం చేస్తున్న పాలకుల విధానాలను ప్రతిఘటించాలని కోరుతూ ఆంధ్ర ప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ శ్రీకాకుళం జిల్లాశాఖ శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట జిల్లా శాఖ అధ్యక్షులు మజ్జి మదన్మోహన్ అధ్యక్షతన ధర్నా చేపట్టింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి మాట్లాడుతూ- "నేటి విద్యా వ్యవస్థ దుస్థితికి కారణం నూతన సరళీకరణ, ప్రపంచీకరణ ఆర్థిక విధానాలే అని, ప్రపంచ బ్యాంక్ నియమ నిబంధనల ప్రకారం పాలకులు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తున్నారని, మెరుగైన పాఠశాల వ్యవస్థ ప్రభుత్వ బడుల పరిరక్షణ కొరకు శాస్త్రీయమైన రెండు రకాల పాఠశాల వ్యవస్థ బదులు అశాస్త్రీయ తొమ్మిది రకాల పాఠశాల వ్యవస్థను నేడు ప్రభుత్వం ఎంచుకోవడం ప్రభుత్వ పాఠశాలల ఉనికికే ప్రమాదమని, రాష్ట్రంలో పూర్తిగా మాతృభాషా మాధ్యమాన్ని ఎత్తివేసే చర్యలు కొనసాగుతుండడం అనైతికమని, ప్రభుత్వ పాఠశాల పట్ల పాలకుల నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా ఉపాధ్యాయులంతా ఉద్యమించాల్సిన ఆవశ్యకత గలదని తెలియజేశారు. అధ్యక్షులు మదన్మోహన్ ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ 'ప్రభుత్వాలు మారినా ఉపాధ్యాయుల సమస్యలకు పరిష్కారం దొరకటం లేదన్నారు. ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఉపాధ్యాయుడు చైతన్యంతో ముందడుగు వేయాలని" కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్ వి అనిల్ కుమార్ ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ- ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉపాధ్యాయులపై ఉందని, విద్యాహక్కు చట్టం సెక్షన్ 12సి ప్రకారం ప్రతి రికగ్నైజ్ పాఠశాలలో 25% విద్యార్థులకు చేర్పించి, వారికి ప్రభుత్వమే ఫీజులు చెల్లించే విధానం ఆగ మేఘాలమీద నిర్వహిస్తున్నారని, ప్రైవేటు పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించే బాధ్యత ఎంఈఓ, సిఆర్పి లకు అప్పగించడం జరిగిందని, దీని నుండి మనం గమనించేది ఏంటంటే ప్రభుత్వం విద్యా రంగం నుండి వైదొలగే ప్రయత్నం జరుగుతున్న విషయం స్పష్టమవుతుందని, నేటి ఫౌండేషన్ స్కూల్స్ రెండు మూడు సంవత్సరాల్లో మూసివేతకు గురవడం జరగబోతోందని, ఈ పరిస్థితుల నుండి బయట పడడానికి ఉద్యమాలే శరణ్యమని" తెలియజేశారు. రాష్ట్ర కార్యదర్శి ధవల సరస్వతి మాట్లాడుతూ- రాష్ట్రంలో విద్యారంగ, ఉపాధ్యాయరంగ సమస్యలపై దీర్ఘకాలిక పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని, ఏ ప్రభుత్వాలు వచ్చినా సమస్యలు పరిష్కారం కాకపోగా మరింత జటిలము అవుతున్నాయని, ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు సమస్యలపై ప్రతి ఒక్కరు ఉద్యమించాల్సిన అవసరం ఉందని తెలియజేశారు. ఎల్ ఎఫ్ ఎల్ రాష్ట్ర సంఘ అధ్యక్షులు బలివాడ ధనుంజయరావు ధర్నా శిబిరాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ-అశాస్త్రీయ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కదలాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు వి. నవీన్ కుమార్, దాసరి రామ్మోహనరావు, జి. భీమారావు, పితిరుమలరావు, బి. అప్పలనాయుడు, సిహెచ్ త్రినాధరావు, సదాశివుని శంకరరావు, పి మోహన్ రావు, జిల్లాలో గల అన్ని మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సభ్యులు హాజరై విజయవంతం చేశారు.

## మూలిపాడులో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

**మందస, మే 9(వార్త):** మందస మండలంలోని మూలిపాడు గ్రామంలో ఆధ్యాత్మికత సంతరించుకుంది. ఎటుచూసినా భక్తి, శ్రద్ధలతో ప్రజలు పూజలు చేస్తూ కనిపించారు. శ్రీముకేశ్వరస్వామి, సుబ్రహమణ్యస్వామి ఆలయం, బుద్ధ విగ్రహాలు, నవ గ్రహాలు ప్రతిష్ట సందర్భంగా గురు, శుక్రవారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూర్ణకుంభాలతో మహిళలు గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ధ్వజస్థంబం, మండపం ప్రారంభోత్సవాలు చేశారు. అర్చకుల ఆధ్వర్యంలో హెూమాలు జరిగాయి. శాంతి హెూమం చేశారు. అర్చకులు సంప్రదాయరీతిలో పూజలు నిర్వహించారు. ఒకేసారి పలు ఆలయాలు, ఒకేచోట ప్రారంభించడంతో గ్రామస్తుల భక్తితన్మయత్వం చెందారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ప్రత్యేక పూజలు, కళాకారుల విన్యాసాలు మధ్య జరిగిన ఈ కార్యక్రమాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## మేడపై నుంచి జారి పడి వ్యక్తి మృతి

**హిరమండలం, మే 9 (వార్త):** మేడపై నుంచి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. శుక్రవారం ఎస్ఐ ఎండీ యాసీన్ అందజేసిన వివరాలు మేరకు అంబావల్లి గ్రామానికి చెందిన చిట్టి లక్ష్మీ నారాయణ (74) గత నెల 27న మేడ మీద పడుకోవటానికి వెళ్లగా, మేడకు పిట్ట గోడ లేకపోవటంతో జారి పడినట్టు ఆయన తెలిపారు. తలకు తీవ్ర గాయాలు కావటంతో హిరమండలం పీహెచ్‌సీకు తరలించగా, ప్రథమ చికిత్స చేసిన అనంతరం పరిస్థితి విషమించటంతో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మరణించాడన్నారు. మృతుడుకు భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ బీవీ రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు.

# మాదకద్రవ్యాల కట్టడికి పటిష్ఠ నిఘా

- టోల్ ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం ఇవ్వండి
- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**శ్రీకాకుళం, మే 9((వార్త):** మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు జిల్లాలో కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా యాక్షన్ కమిటీ సమావేశం జరిగింది. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు, వర్కర్లు, ఆటో డ్రైవర్లను లక్ష్యంగా చేసుకుని మత్తుపదార్థాలు సరఫరా జరుగుతున్నట్లు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్ విక్రయాలు జరిగే ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేయాలన్నారు. బాధితులకు కౌన్సిలింగ్, పునరావాసం కల్పించాలన్నారు. స్కూళ్లు, కాలేజీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మెడికల్ షాపులన్నింటిలోనూ సీసీ కెమెరాలు అమర్చాలని, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా 18 సంవత్సరాల లోపువారికి మందులు ఇవ్వరాదని సూచక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సోషల్ మీడియాలో డ్రగ్స్ రహిత సమాజంపై ప్రచారం నిర్వహించాలని సూచించారు. గ్రామ స్థాయిలో ఆశ వర్కర్లు, మహిళా పోలీస్‌లు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ వర్కర్లతో పర్యవేక్షణ జరిపించాలన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈగల్ టీంలు మాదకద్రవ్యాల నిరోధంపై ప్రత్యేక నిఘా నిర్వహిస్తున్నాయని తెలిపారు. డ్రగ్స్ సమాచారం కోసం 112 లేదా 1972 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. రిమ్స్‌లోని డీ-అడిక్షన్ సెంటర్‌ను అందుబాటులో ఉంచుతామన్నారు. హాస్టళ్లలో డ్రగ్స్ వాడకంపై పర్యవేక్షణ జరిపిస్తామన్నారు. స్కూళ్లు, కాలేజీలు, హాస్టళ్ల పరిసరాల్లో బోర్డులు ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ సందర్భంగా మత్తు పదార్థాలను అరికట్టే సమాచారం తో కూడిన పలు గోడపత్రికలను ఆవిష్కరించారు.



**రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలి**

జిల్లాలో రోడ్డు భద్రతా చర్యలను మరింత కఠినతరం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జరిగింది. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, సభ్యులుగా ఎస్పీ, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రహదారులపై ప్రమాదాలకు అవకాశాలు ఉన్న చోట్ల ఎన్ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేయాలన్నారు. డివైడర్లను తొలగిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఇంజనీరింగ్ శాఖలు ఇటీవల జరిగిన ప్రమాదాల విశ్లేషణ చేసి నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. ప్రమాద సమయంలో 108 వాహన సేవలు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యారోగ్యశాఖను ఆదేశించారు. స్కూల్స్, కాలేజీల వద్ద స్పీడ్ బ్రేకర్లు, పెట్రోలు బంకల వద్ద సీసీ కెమెరాలు, మలుపుల వద్ద బ్యారికేడ్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలన్నారు. బ్లాక్ స్పాట్స్ గుర్తించి డ్రైవర్ల కోసం రెస్ట్ ఏరియాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కమర్షియల్ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. ట్రామా కేర్ సెంటర్లను ఏర్పాటు చేయడం కోసం వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాసంస్థల వద్ద రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సినిమా థియేటర్లలో లఘు చిత్రాల ద్వారా ప్రజలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా జాతీయ రహదారుల టోల్ ఫ్రీ నెంబర్ కు ఫోన్ చేసి వాటి పనితీరును గురించి తెలుసుకున్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్, ఆర్ అండ్ బి ఎస్ ఈ జాన్ సుధాకర్, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ విజయ సారథి, ఎన్ హెచ్ ప్రాంతీయ ప్రాజెక్టు డైరెక్టర్ తివారి, మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ గంగాధర్, డి.ఎస్.పి సిహెచ్ వివేకానంద, డిఎంహెచ్వో అనిత, పలువురు సీఐలు, కమిటీ సభ్యులు హాజరయ్యారు.

## గోపాలకృష్ణ గోఖలే.. సంఘ సంస్కర్త

**శ్రీకాకుళం, మే 9 (వార్త):** గోపాలకృష్ణ గోఖలే 159వ జయంతి సందర్భంగా శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధి శాంతి నగర్‌కాలనీలో ఉన్న గోఖలే విగ్రహానికి బాలల హక్కుల పరిరక్షణ వేదిక ప్రతినిధి బృందం పూల మాల వేసి ఘన నివాళులు అర్పించారు. సీఆర్పీఎఫ్ రాష్ట్ర కన్వీనర్ గురుగుబెల్లి దామోదర్ రావు, రాష్ట్ర ప్రతినిధి ముద్దాడ రామకృష్ణ, శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పారుపల్లి శ్రీనివాసరావు లు గోపాలకృష్ణ గోఖలే విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా దామోదరరావు మాట్లాడుతూ గోఖలే ప్రొఫెసర్, గొప్ప రాజకీయవేత్త, సర్వెంట్ ఆఫ్ ఇండియా సొసైటీ వ్యవస్థాపకుడన్నారు. భారత స్వపరిపాలన కోసం సామా జిక సంస్కరణ కోసం ప్రచారం చేసేవారుమని అన్నారు. బాలగంగాధర్ తిలక్, దాదాబాయి నౌరోజి , బిపిన్ చంద్రపాల్, లాలా లజపతిరాయ్ వంటి నాయకులతో సాధారణ భారతీయులకు ప్రజా వ్యవహారాలు రాజకీయ ప్రత్యక్ష అధికారుల కోసం దశాబ్దాల పాటు పోరాడారని ఆయన అన్నారు. మహాత్మా గాంధీకి రాజకీయ గురు వుగా పేర్కొన్నారు. రామకృష్ణ మాట్లాడుతూ గాంధీ దక్షిణాఫ్రికాలో పోరాటాలు చేసి తిరిగి వచ్చి సాధారణ భారతీయుల ఎదుర్కొంటున్నటు వంటి సమస్యలపై జ్ఞానాన్ని గాంధీ గోఖలే వద్ద నేర్చు కునేవారని అన్నారు. సీఆర్పీఎఫ్ శ్రీకాకుళం జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి పారుపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రముఖుల అడుగుజాడల్లో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొవ్వాడ సత్యనారాయణ, మల్ల మురళి, వడ్డి కామేశ్వరరావు, సీర గోవిందరావు, రావాడ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాదర్బార్‌కు వినతుల వెల్లువ

- సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
- ఎమ్మెల్యే రవికుమార్



**ఆమదాలవలస, మే 9(వార్త):** ఆమదాలవలస టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో 64 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల నుండి స్వీకరించే వినుతులను ఆన్లైన్ చేసి శాఖల వారీగా పరిష్కారాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు తమ యొక్క సమస్యలు చెప్పుకునేందుకు ప్రజా దర్బార్ చక్కనైన వేదికని గుర్తు చేశారు. ప్రభుత్వం సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తుందని తెలిపారు. ఐదేళ్ల విధ్వంస పాలన నుండి బయటపడి రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందన్నారు. అర్హత ఉన్నవారికి ప్రభుత్వ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన వారందరి నుండి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తులు స్వీకరించిందని త్వరలోనే ఇంటి నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతిస్తుందని చెప్పారు. 2023 డిసెంబర్ ఒకటి తరువాత పింఛన్ పొందుతూ ఎవరైతే మరణించారో వారి భార్యకు పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. 2023 డిసెంబర్ ముందు నాటికి కొంతమంది వితంతువులు ఉన్నట్టు రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల దృష్టికి వచ్చిందని ఈ విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లామని అవి కూడా పరిష్కారం అవుతాయన్నారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పక్కా రహదారులు జరుగుతున్నాయని, నియోజకవర్గంలో 100 కిలోమీటర్ల సీసీ రహదారులు జరిగాయని చెప్పారు. రానున్న నాలుగేళ్లలో అన్ని గ్రామాలకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు నూకరాజు, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎస్.మురళిరావు, ఎంపీటీసీ అన్నెపు భాస్కర్ రావు, కొండబాబు తదితరులు ఉన్నారు.



### 130 అర్జీలు స్వీకరణ

**రణస్థలం:** రణస్థలం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు శుక్రవారం నిర్వహించారు. 130 అర్జీలను స్వీకరించారు. వాటిని పరిష్కరించేలా చూడాలని మండల అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు, తహశీల్దార్ ప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో ప్రకాష్ రావు, నాలుగు మండలాల కూటమి నాయకులు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# ఏపీ మంత్రి మండలి నుంచి ముగ్గురు ఔట్?

- పలువురి శాఖల్లోనూ మార్పులు
- బీజేపీ, జనసేన ఎమ్మెల్యేలకు అవకాశం
- జూన్ 12 తర్వాతే చేర్పులుమార్పులు

**శ్రీకాకుళం, మే 9 (వార్త):** ఏపీలో మంత్రివర్గ విస్తరణ విషయంలో మరోసారి ప్రచారం పెద్ద ఎత్తున సాగుతోంది. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు తన మంత్రివర్గ సభ్యుల పనితీరుని మదింపు చేస్తూ కొందరి విషయంలో అసంతృప్తిని వ్యక్తం చేశారు అన్న వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. ఇక మంత్రుల పనితీరు విష యంలో ప్రతీ మంత్రివర్గ సమావేశంలో చంద్రబాబు దిశానిర్దేశం చేస్తూనే వస్తున్నారు. అయితే కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఇప్ప టికీ తన తీరు మార్చుకోని వారి విషయంలో ఇక సీరి యస్‌గానే కూటమి పెద్దలు ఉంటారని వార్తలు వస్తు న్నాయి. ఆ విధంగా చూస్తే ముగ్గురు మంత్రుల విష యంలో అయితే తీవ్ర అసంతృప్తి ఉందని వారిని తప్పించే చాన్స్ ఉందని కూడా కొన్ని పుకార్లు షికారు చేస్తున్నాయి. ఇంతకీ ఆ మంత్రులు ఎవరు అంటే ఎవరికి తోచిన పేర్లు వారు చెబుతున్నారు. అయితే వారు తమ శాఖల పట్ల ఈ రోజుకీ మెరుగుదల చూపించలేకపోయారు అని అంటున్నారు. అంతే కాదు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల మీద కూడా ఫోకస్ పెట్టి జనంలోకి తీసుకుని వెళ్ళడం లేదని చెబు తున్నారు. చంద్రబాబు మంత్రివర్గంలో 25 మందిని తీసుకునే అవకాశం ఉంది. అయిత 2024 జూన్ 12న జరిగిన కూటమి ప్రమాణంలో 24 మందికి మాత్రమే చోటు కల్పించారు. ఒక బెర్త్ ఖాళీగానే ఉంది. దానిని జనసేన ప్రధాన కార్యదర్శి మెగా బ్రదర్ నాగబాబుకు ఇస్తారని అంటున్నారు. దీంతో జనసేనకు మంత్రివర్గంలో నాలుగు మంత్రి పదవులు దక్కుతాయన్న మాట. ఇప్పటికే ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ ఉన్నారు. అలాగే నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ జనసేన కోటాలో మంత్రులుగా కొనసాగుతున్నారు. ఇపుడు నాగబాబుకు సైతం మంత్రి పదవి ఇస్తే వీరితో పాటే కొనసాగుతారు. ఇక జనసేనకు 21 మంది ఎమ్మెల్యేలు ఉంటే నాలుగు మంత్రి పదవులు ఇస్తే ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్న తమకు రెండు మంత్రి పదవులు అయినా ఇవ్వాలని బీజేపీ కోరుతోంది. దాంతో కూటమిలో మిత్రులను మరింతగా దగ్గర చేసుకోవడానికి బీజేపీకి కూడా మరో మంత్రి పదవి ఇస్తారని ప్రచారం ఉంది. ఇప్పటికే ఆ పార్టీ తరఫున సత్యకుమార్ యాదవ్ మంత్రిగా ఉన్నారు. ఇక బీజేపీకి రెండవ మంత్రి పదవి ఇవ్వాలంటే కూటమిలో మంత్రి వర్గంలో ప్రస్తుతం కొనసాగుతున్న వారి నుంచి ఎవరో ఒకరిని తప్పించాలి. అదే విధంగా టీడీపీలో కూడా ఆశావహులు కొందరు మంత్రి పదవుల విషయంలో ఆశలు పెట్టుకున్నారు. అలా మరో ఇద్దరికి చాన్స్ ఇవ్వాలని చూస్తున్నారు అని అంటున్నారు. దాంతో ముగ్గురు మంత్రులను తప్పించి కొత్తగా మరో ముగ్గురిని తీసుకుంటారు అన్న ప్రచారం అయితే ఊపందుకుంటోంది. అదే కనుక జరిగితే ఏపీ మంత్రివర్గంలో భారీ మార్పులు ఉంటాయని అంటున్నారు. పలువురి శాఖలలో సైతం మార్పులు జరిగే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇక మంత్రివర్గంలో చేర్పులు మార్పులకు జూన్ 12 తరువాత సరైన ముహూర్తం ఎంచుకుంటారు అని అంటున్నారు జూలైలో ఆషాడ మాసం శూన్య మాసం కావడంతో జూన్ నెలాఖరు లోగా ఈ మార్పులు చేర్పులూ అనుకుంటే చేయాల్సి ఉందని అంటున్నారు. మరి జరుగుతున్న ప్రచారంలో ఎంత వరకూ నిజం ఉందో కానీ అదే కనుక జరిగితే రాజకీయంగా కొంత సంచలనమే అవుతుంది.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546